అక్కడి యాజమానుల్లోనూ దయామయులు ఉంటారు. రాక్షసంగా ప్రవర్తించే వాళ్లూ ఉంటారు. వేరే దేశాలనుంచి వచ్చిన మగవాళ్లు భవన నిర్మాణ పనులల్లోనూ, వ్యవసాయ పనుల్లోనూ, డ్రైవర్లుగానూ పనిచేస్తున్నారు. ఒక దినార్ సుమారు రెండువందల డెబ్బై రూపాయలు ఉంటుంది. వీళ్లకిచ్చే జీతాలు మాత్రం డెబ్బై నుంచీ వందా, నూటిరవై దినార్లు.. అలా ఉంటాయి. ఆ కాస్త జీతంలోనూ ఐదు వేలో, పదివేలో ఏజెంట్లు తమ కమీషన్‌గా తీసుకోగా, పదో పరకో తమ ఖర్చులకు ఉంచుకొని.. మిగితాదే ఇక్కడి కుటుంబాలకు పంపుతారట. ఒక్కోసారి వేరేప్రాంతం వాళ్లు వీళ్ల సొమ్ము కాజేయడం కూడా జరుగుతుందట. ఇక ప్రపంచంలోని ఏ ప్రాంతం ఆడవాళ్లకైనా.. లైంగిక రక్షణ అనేది ఎప్పుడూ ప్రశ్నార్థకమే..!' అని వసంత మాటల్లో విన్నప్పుడు.. అనుపమకు చాలా బాధనిపించింది.

* * *

సమయం ఎనిమిది కావొస్తున్నది. అనుపమ ఆటోలో ఆఫీస్‌కు ప్రయాణమైంది.

''మనకు, కుయ్యేటోళ్లకు రెండున్నర గంటలు తేడా అంట మేడమ్. ఇప్పుడు వసంత వాళ్లకు పదిన్నర ఐతదేమో. ఆళ్లయితే జీతమిచ్చిన ఒక్కరోజే వసంతతో మాట్లాడిపిస్తరు. మీరు నాకు మంచి ఫోన్ ఇచ్చుడు, ఆ తల్లి ఫాతిమా ఆపా పుణ్యమా అని శుక్లారం శుక్లారం మాట్లాడిపిస్తాంది. అంతా అమ్మతల్లి దయ. కానీ, వసంత సంతోషంగా లేదు మేడమ్. వచ్చేస్తనని మస్తు ఏడుస్తున్నది''.. ఆటో నడుపుతున్న రాజు దిగులుగా అన్నాడు.

''మేడమ్.. ఎప్పటితీరు ఆ సింతచెట్టుకాడ ఆపుత. ఆడ మీరు టిపినీ తిందురుగానీ'' అన్నాడు.

పెద్దగా అలికిడి లేని దారిలో ఉన్న చింతచెట్టు దగ్గర ఆటో ఆపాడు రాజు.

అనుపమ రాజుకొక అరటిపండు ఇచ్చి, తాను బాక్స్ తీసుకుని తినడం ఆరంభించి..

''ఏంటి రాజూ! ఇవ్వాళ శుక్రవారమనా అంత హడావుడి పడుతున్నావు'' అని అడిగింది.

''అంతేకదా మేడమ్!'' అన్నాడో లేదో రాజు ఫోన్ మోగింది.

ఆటో పక్కన నిలబడి మాట్లాడసాగాడు. అంతటి నిశ్శబ్ద వాతావరణంలో.. ఆమె మాటలు స్పష్టంగా బయటికి వినపడసాగాయి.

''ఎట్లున్నవు వసంతా?'' అని రాజు అడిగాడో లేదో.. కస్సుమన్నది వసంత.

''ఎట్లుంట!? నేనేమన్న జాగీర్దారీ కొలువుకు బోయిన్నా? పనిమనిషిగ బోయిన. వంటమనిషిగ బోయిన. నా బిడ్డలకు ఒక్కబుక్క బువ్వ దినిపించకున్నా.. దేశంగానీ దేశంల ఎవ్వళ్ల బిడ్డలకో చాకిరీ జేస్తున్న. బాసన్లు దోముడు, ఇల్లు తుడ్సుడూ, బట్టలుతికి ఇస్త్రీలు జేసుడు, వొండుడు వొడ్డించుడూ.. అన్నీ నా పనులేనాయేనని సంబురపడ్డున్న..'' గట్టిగా అరిచింది.

అంతలోనే భోరుమని ఏడుస్తూ..

''నేనీడ ఉండ.. రాజూ! ఎట్లన్న జేసి ఏజెంట్ రాందాసును బతిమ్లాడి నన్ను ఎన్కకు బిలిపియ్యి. నేను అచ్చేస్తా రాజూ! పిల్లలను సూడాల్నని పాణం తన్నుకలాడుతాంది దయ్యా..'' వసంత వెక్కిళ్లు పెడ్తున్నది.

''గట్లేడ్వకు వసంతా! మాకు మాత్రం నిన్ను సూడాల్నని లేదా? చిన్నపోరడైతే.. 'అమ్మను దీస్కరా!' అని ఒక్కతీరు లొల్లివెడ్తలేడు. ఊకో వసంత! నువ్వు గట్లేడిస్తే ఈడ నేను ఎట్లుంట జెప్పు!?'' రాజు కూడా కన్నీళ్లు పెట్టుకున్నాడు.

అనుపమ ఇక తినలేక బాక్స్ మూసేసి మౌనంగా కూర్చున్నది.

''ఒగల తోడు లేకుంట, పుట్టింటికి సుత ఏనాడూ బంపలేదు. గసొంటిది ఒంటరిగా నన్ను ఎడారికే బంపినవ్. ఈడ సుత పిల్లలున్నరు. వాళ్లు నా పిల్లలు గారు. మనుసులున్నరు కానీ, వాళ్లు నా వోళ్లుగారు. తిన్నా తినకున్నా ఎవరికి పట్టదు. రోగమొచ్చినా, బాధొచ్చినా జరంతసేపు కాళ్లు ముడుసుకుని పండనీకి లేదు. ఛీ.. ఏం బతుకిది!?'' మాట్లాడుతూనే ఎవరో వచ్చిన అలికిడికి ఫోన్ కట్ చేసింది.

అనుపమకు ఆఫీస్ టైమ్ అవుతున్నా.. ఆటో పక్కకు వెళ్లి నిశ్శబ్దంగా ఏడ్చుకుంటున్న రాజును తొందరపెట్టి పిలవలేదు. వారంవారం రాజు ఫోన్ కోసం ఆత్రంగా ఎదురుచూడటం.. వసంత ఏడుస్తూ మాట్లాడటం.. రాజు బాధపడటం.. ఇలా కొన్నివారాలుగా జరుగుతూనే ఉన్నది.

* * *

మరో నెల గడిచిపోయింది. ఒక శుక్రవారం వసంత చెప్పిన మాటలకు రాజుతోపాటు అనుపమ కూడా అమితంగా కదిలిపోయింది. అది ఓ ఆడదాని వేదన అనాలో, ఒక కన్నతల్లి ఆక్రోశం అనుకోవాలో అర్థం కాలేదామెకు.

''నేను ఈడ ఉండను రాజూ! వెంటనే ఏజెంట్ రాందాసుకు చెప్పి టికెట్ తీపియ్యి'' అని ఏడ్చింది.

''ఏజెంట్‌కు, మా అమ్మకు ఏం జెప్పాలే?''.. ఒకింత అయోమయంగా అన్నాడు.

''సచ్చిపోయిన అని జెప్పు. నేను బతికున్నాననే కదా! సంపాదించి పోస్తనని జూస్తున్నరు.. నేను సచ్చిపోతే సంపాదన ఆగిపోతది కదా! సచ్చిపోయిన అనుకోండ్రి.. నా పిల్లలను నాకిస్తే చాలు. మీకు దూరంగా యాడకన్నా బోయి బతుకుతా. ఈ కట్టమేదో నా సొంతగడ్డ మీద జేసుకుంటా! మనిషినని మర్సిపోయి గానుగెద్దు తీరు పనిజేస్తున్న రాజూ! మనిషినని మర్సిపోతున్ననానీ.. ఆడిదాన్నని మర్సిపోలేక పోతున్న! ఛీ.. ఈళ్లసలు మనుసులేనా!? ఒక్కొక్కళ్లకు ఇద్దరు ముగ్గురు పెండ్లాలున్నా కుతిదీరదు ఈళ్లకు. గా పెద్దసారు తమ్మునికి నా మీద కన్నువడ్డది రాజూ.. ఎట్లెట్లనో జేస్తున్నడు. ఇగ నేనీడ ఉండనంటె ఉండ! ఈ ఇల్లొదిలి ఇంకో ఇంట్ల పనికి కుదిరినా.. ఆడ మంచోల్లే ఉంటరని గ్యారంటీ లేదు. కుయ్యటకు బోవుడంటే.. పిల్లగాళ్లకు కడుపునిండా కూడు బెట్టుడు అనుకున్న గానీ, నా కుతికకు నేనే ఉరి బోసుకునుడని అనుకోలేదు రాజూ!''.. వసంత ఏడుస్తున్నది. రాజు ఒక్కక్షణం మౌనం వహించగానే..

''రాజూ! ఇగ ఆడిదాన్నని కూడా మర్సిపొమ్మంటవా!? గట్లయితే.. మర్సిపోతగానీ.. అమ్మనని మాత్రం మర్శిపోలేను. పిల్లలను సూడకుండ ఉండలేకపోతున్న రాజూ!''..

ఫోన్ కట్టయ్యింది. బరువుగా అడుగులేస్తూ ఆటో ఎక్కిన రాజు..

''కుయ్యట్ వంపే ఏజెంటు.. 'మీ ఆడోళ్లకు పిల్లలు పుట్టకుంట ఆపరేషనైందా!?' అని అందర్ని ఊకె అడుగుతాంటే.. ఆపరేషన్ అయినంక కూడా మంచిగ పనీపాటలు జేస్తున్నరా లేదా తెలుసుకోనీకి అడుగుతున్నడు కావచ్చు అనుకున్నం మేడమ్. 'గస్వంటివి ఏం ఉండయి! ఇంటి పనులే జేపించుకుంటరు.. గంతే!' అని నమ్మిచ్చిండు. అసల్కే పిల్లలను, తల్లిని దూరంజేసిన పాపం నాకొద్దని బాధపడ్తాన్న! ఇప్పుడసలు ఆ మనిషి నాకు దక్కుతదో లేదోనని భయమేస్తాంది మేడమ్!''.. ఏడుస్తూనే ఆటోను ముందుకు పోనిచ్చాడు.

* * *

మర్నాడు అనుపమను తీసుకెళ్లడానికి ఆటో తీసుకుని మధు వచ్చాడు. ఎప్పుడైనా రాజుకు రావడం వీలు కానప్పుడు అతని దోస్త్ మధును పంపుతుంటాడు.

''రాజు నిన్న రాత్రే ఆటోను అమ్మేశాడు మేడమ్. ఆ పైసలతోని ఏజెంట్‌కున్న బాకీ కట్టి, వసంతకు టిక్కెట్ దీస్తడంట!'' అని చెప్పాడు.

ఓ కన్నతల్లి తన బిడ్డలను చేరుతున్నందుకు అనుపమ చాలా హాయిగా ఊపిరి పీల్చుకున్నది.

పదిరోజుల తరువాత అనుపమను ఆఫీస్‌కు తీసుకెళ్లడానికి కిరాయి ఆటో తీసుకుని వచ్చిన రాజు.. ఓ ఐదు కేజీల బెల్లం తెచ్చి అనుపమకు ఇచ్చాడు.

''ఏంటి రాజు ఇదీ?'' అని ఆశ్చర్యంగా అడిగారు అనుపమ దంపతులు.

''బంగారం మేడమ్! సమ్మక్క గద్దెలకాడ వసంత ఎత్తు బెల్లం తూకం ఇద్దమని అనుకున్న మేడమ్. 'నా తీరు బాధపడ్తున్న ఇంకొక నలుగురిని సుత సొంత దేశానికి పంపనీకీ సాయం జేసిన ఫాతిమా ఆపా అరవైఎనిమిది కేజీల బరువుంటది. ఆమెత్తు బంగారం మొక్కు దీర్సుకుందం రాజూ..!' అన్నది వసంత. ఆ తల్లి కడుపు సల్లగ.. ఆ ప్రసాదమే దెచ్చిన మేడమ్..!'' అని చెప్తున్న రాజు ముఖంలో.. పున్నమి చంద్రుని కళలు వెల్లివిరిసాయి.

## సమ్మెట ఉమాదేవి



తాను చూసిన ఓ ఆటో డ్రైవర్ – గల్ఫ్ దేశంలో ఉండే అతని భార్య కష్టాలు, వారి నిస్సహాయ జీవన సారాంశాన్నే 'ఇసుక తైలం'గా మలిచారు రచయిత్రి సమ్మెట ఉమాదేవి. వీరి స్వస్థలం ఖమ్మం. ప్రస్తుత నివాసం హైదరాబాద్. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేసి, విరమణ పొందారు. ఇప్పటివరకూ 150కిపైగా కథలు రాశారు. అమ్మ కథలు, రేలపూలు – తండావాసుల కథలు, జమ్మి పూలు, సమ్మెట ఉమాదేవి కథానికలు పేరుతో కథా సంపుటాలను వెలువరించారు. బాలసాహిత్యంలోనూ.. అల్లరి కావ్య, పిల్లల దండు, నిజాయతీ, పిల్లి ముసుగు, ఏమి చేస్తారు? ఏమేమి చేస్తారు? ఏక కథా పుస్తకాలుగా, మా పిల్లల ముచ్చట్లు – ఒక టీచర్ అనుభవాలు, చిలుక పలుకులు, నిక్ అంటే ప్రేరణ – నిక్ వుయిచిచ్ విజయ గాథ.. పుస్తకాలను వెలువరించారు. కావలి సాహితీ వారధి, మాడభూషి రంగాచార్య, గోవిందరాజు సీతాదేవి, నందివాడ శ్యామల, ఎమ్మెస్సార్ స్మారక సాహితీ పురస్కారాలను అందుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి ప్రతిభా పురస్కారం, తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సాహితీ పురస్కారం, తెలంగాణా పరిషత్ ధర్మనిధి పురస్కారం, మహాకవి సినారె కళాపీఠం పురస్కారం, అపురూప విద్యా పురస్కారాలు, కవితా విద్యా సాంస్కృతిక, మంగాదేవి.. బాల సాహితీ పురస్కారాలను పొందారు. బాల సాహిత్యంలో విశేష కృషిని కొనసాగిస్తున్నారు.